# విశ్వజ్ఞానయజ్ఞం – 2021

## మహాత్ములు నేటి తరానికి మార్గదర్శకులు

### నాదయోగి - త్యాగయ్య మొదటి రోజు (6/26/2021)




శివాయ గురవే నమః

శ్రీమాత్రేనమః

శ్రీవిష్ణురూపాయనమఃశివాయ

అన్నమాచార్యుల వారు కానీ, త్యాగరాజస్వామి కానీ ఒక సంగీతకారులుగా, కళాకారులుగా మాత్రమే కాకుండా ఒక యోగులుగా చూడవలసిన వారు అని చెప్పడం! వారి జీవితంలోనుండి మనం సాధనకి పనికి వచ్చే విషయాలు గ్రహించాలి. సంగీత సాహిత్యాల పుష్టి ఉంటూ ఆ రెండిటి పరమార్థమైన ఆధ్యాత్మిక సాధనపరమైన అంశాలని గ్రహించాలి. వారి జీవితం, వారు చెప్తున్న వ్యక్తీకరణ ఒకటిగా ఉంటాయి!

త్యాగయ్య కేవలం సంగీతకారుడిగా కాకుండా ఒక భక్తుడిగా, యోగిగా, తాత్త్వికుడిగా, జీవన్ముక్తుడిగా దర్శనం ఇస్తారు. వారి జీవితాన్ని అధ్యయనం చేస్తే ఒక యోగి జీవితం ఎలా ఉంటుంది? గృహస్థు అయినవాడు దానినుండి ఎలా నేర్చుకోవాలి, ఎలా సార్థకం చేసుకోవాలి తెలుసుకోవచ్చు.

త్యాగయ్య గురించి తెలియనివారెవరూ ఉండరు! భారతీయ సంగీతంలోని త్యాగయ్యది ప్రత్యేక స్థానం! విదేశస్థులు కూడా ఈ కీర్తనలు నేర్చుకుని త్యాగరాజ ఆరాధనోత్సవాలలో పాల్గొంటారు! అది తెలుగువారికి గర్వకారణం!
వారి కీర్తనల ద్వారా వారి హృదయం, నాదాన్ని ఎలా యోగంగా మలచుకున్నారు, అది తెలుసుకోవాలి!
సంగీతపరంగా చూస్తే అద్భుత స్వరకల్పన, స్వరానికి తగ్గ సాహిత్యం రచించారు!
లోపల ఆయన ఆర్తి, భక్తి, తత్త్వం ఇవన్నీ గమనిస్తే ఉపనిషత్ రహస్యాలు ఉంటాయి!
పరమాచార్యవారు త్యాగయ్యని త్యాగబ్రహ్మ అన్నారు, ఉపనిషత్ స్వరూపంగా ఆయన కీర్తనలని భావించారు, చూపించారు, బ్రహ్మవిద్యా రసికః అని కూడా అన్నారు!

త్యాగయ్య వాంఙ్మయం గురించి తెలుసుకోవడం అంటే మన సనాతనధర్మంలోని తాత్త్వికతని, సాధనపరమైన, నైతికపరమైన అంశములని గమనించడమే!
సంగీతం, నాట్యం మొదలైనవి అందరు వినోదంగా ఏర్పరుచుకున్నారు! కానీ వినోదంగా అందరూ భావించే విద్యని మోక్షవిద్యగా మలచిన ఘనత భారతీయ మహర్షులది. భారతీయ సంగీతం అంతా యోగం,మోక్షవిద్య! భోగం కాదు!

త్యాగయ్య ఆయనే స్వరపరిచారు కావున అందులో నాదశక్తి ఉంటుంది. సంగీతత్రయం ముగ్గురూ కూడా సంగీతాన్ని మోక్షవిద్యగా దర్శించి, సాధించి, సిద్ధి పొంది చూపారు!

ఈయన 1767 లో జన్మించి 1847 వరకూ జీవించారు.
వీరియొక్క సాహిత్యంపై చాలా విస్తారమైన వ్యాఖ్యలు వచ్చాయి. తెలుగులో కల్లూరి వీరభద్రశాస్త్రిగారు, నూకల చినసత్యనారాయణగారు, పురుషోత్తమకవి గారు రచించారు. ఇలా ఎందరో మంచి మంచి వ్యాఖ్యానములు రచించారు. ఆంగ్లంలో రాఘువన్ గారు " ది హెరిటేజ్ ఆఫ్ త్యాగరాజ" అని రచించారు.

ఈయన కమలాపురంలో/ తిరువారూర్లో జన్మించారు. అక్కడ జన్మిస్తేనే మోక్షం అంటున్నది శాస్త్రం!
తల్లిదండ్రులు రామబ్రహ్మము, శాంతమ్మ గారు. ఆ తరువాత తండ్రి తిరువయ్యార్ వచ్చి స్థిరపడ్డారు.
తిరువారూర్ లో పరమేశ్వరుడి పేరు త్యాగరాజేశ్వరుడు. ఆయన పేరే ఈయనకి పెట్టారు.
ఇంట్లో సంప్రదాయబద్ధమైన కుటుంబం కనుక పరంపరగా రామపంచాయతనం ఉన్నది.
బాల్యంలోనే గోడల మీద "నమో నమో రాఘువాయ" అని రచిస్తూ ఉండేవారట.
శొంఠి వెంకటరమణయ్య గారు అని తంజావూరు ఆస్థాన విద్వాంసుడి వద్ద శిష్యరికం చేసి సంగీతం గ్రహించారు.
త్యాగయ్య మాతామహులు అయినటువంటి వీణా కాళహస్తయ్య గారింట్లో అనేక సంగీత గ్రంథాలని అధ్యయనం చేసారు. ఆ తర్వాత ఇంకా ఏదో గ్రహించాలనుకున్నారుట. అలా ఎంతో తపన పడుతున్న వారితో శొంఠి వెంకటరమణయ్య గారు అన్నారుట నీకు ఇంక భగవంతుడే నేర్పించాలి నాయనా అని! ఇంకా ఏదో నేర్చుకోవాలనే తపన చాలా మంచిది! విద్యని విద్య కోసమే అధ్యయనం చేయడం ఋషిసంస్కారం!
ఇంకా సంగీతంలో పరిపూర్ణత సాధించాలి అనుకున్నాడు ఎందుకు? ఆ సంగీతాన్ని యోగంగా మార్చుకుని పరమాత్మని పొందాలి అని! అదే చెప్తారు యాజ్ఞ్యవల్క్య మహర్షి "ఎవరికి వీణావాదన తత్త్వం తెలుస్తుందో, ఎవరు శృతి జాతులు, తాళము, లయ ఇవన్నీ తెలిసి సాధన చేస్తాడో అతడు నాదోపాసన చేసినవాడై ముక్తిని పొందుతాడు" అని! సంగీతాన్ని నాదయోగం చేస్కోవాలి!

గురువులు ఆయనకి నారదోపాస్తి మంత్రం అని ఒక మంత్రాన్ని ఉపదేశించారు. బాల్యంలోనే ఉపనయనం అయ్యాక రామకృష్ణాయతీంద్రులు రామతారక మంత్రాన్ని ఉపదేశించారు. అది చేస్తూనే ఉండేవారు బాల్యం నుండి! ఇప్పుడు నారదోపాస్తి మంత్రం యతీంద్రులు ఇచ్చారు. దాన్ని సాధన చేసారు, ఆ సాధన వల్ల నారదమహర్షి దర్శనం అయి, స్వరార్ణవము అనే గ్రంథం ఇచ్చారు అని చరిత్ర చెప్తున్నది! దీనికి సత్యమే అనే తార్కాణం ఆయన కీర్తనల్లో కూడా కనపడుతుంది!
సంగీత విద్యలో నారదుల వారు గురువు! ఆయన మహతీ వీణతో ఎటువంటి దివ్యత్వాన్ని సాధించారనేది భారతీయ వైదిక పురాణాలూ చెప్తున్నాయి! అంతేకాక నారదులవారు భాగవత ధర్మానికి ఆచార్యుడు! అందుచేత త్యాగయ్య నారద హృదయాన్ని, భగవత్ ధర్మాన్ని కూడా గ్రహించాడు! ఏ నారదుడు వ్యాసులవారిచే భాగవతం, వాల్మీకి మహర్షిచే రామాయణం రచింపచేసారో

ఆ దేవర్షిని ఉపాసించారు త్యాగయ్య! నారద ఉపాసనా పద్ధతులు చాలా ఉన్నాయి! ఆయన ఉపాసించదగిన స్వరూపం!

పల్లవి:

నారద గురుసామి యికనైన నన్నాదరింపవేమి? ఈ కఋవేమి? ॥నారద॥

అను పల్లవి:

సారెకు సంగీత యోగ నైగమపారంగతుఁడైన పరమ పావన! ॥నారద॥

చరణము(లు):

ఇతిహాస పురాణాగమ చరితము - లెవరివల్లఁ గలిగె?

పతిని దానమివ్వ బుద్ధి సత్య - భామ కెటులఁ గలిగె?

ద్యుతిజిత శరదాభ్ర! నిను వినా, మునియతుల కెవరు గలిగె?

క్షితిని, త్యాగరాజ వినుత! నమ్మితి చింత దీర్చి ప్రహ్లాదుని బ్రోచిన ॥నారద॥

"సంగీతయోగనైగమపారంగత పరమపావన" అనే మాట వేశారు! సంగీతయోగము అనే వేదంలో పారంగతుడివి ఓ స్వామి! అంటూ కీర్తించారు!

త్యాగయ్య అనేక శాస్త్రాలలో, వేద, పురాణ వాంఙ్మయంలో ఉద్ధండుడు! కేవలం సంగీతమే కాక!

పల్లవి: శ్రీనారద! నాద సరసీరుహ భృంగ, శుభాంగ ॥శ్రీ॥

అను పల్లవి: దీనమానరక్షక! జగదీశ! భేష సంకాశ ॥శ్రీ॥

చరణము(లు):

వేద జనిత వర వీణా వాదన తత్త్వజ్ఞ!

ఖేదకర త్రితాప రహిత! ఖేచర వినుత!

యాదవ కులజాప్త! సదా మోద హృదయ మునివర్య!

శ్రీద త్యాగరాజ వినుత! శ్రీకర! మాం పాలయ ॥శ్రీ॥

నాదము అనే పద్మంలో తుమ్మెదలా విహరించే ఓ నారదమహర్షి! వీణావాదనతత్త్వజ్ఞ అన్నారు అంటే యాజ్ఞవల్క్య మహర్షి చెప్పిన నాదయోగము గురించిన విషయం ఈయనకి తెలుసు అనే విషయం తెలుస్తున్నది! ఖేదములని కలిగించే తాపత్రయములు లేనివాడు అని కీర్తించారు!

తెల్లని కాంతితో మెరిసిపోతూ శరత్కాల వెన్నెల వలే నారదమహర్షి ఉంటారని కీర్తించారు.

నారదదర్శనం కలిగినట్లు చెప్పే కీర్తన
"**శ్రీనారదముని గురురాయా కంటి ఏనాటి తపేమో గురురాయా మనసారా కోరితి నేడు కనులారా కంటి గురురాయా**"
ఎన్నో జన్మల తపఃఫలంగా నిన్ను చూడగలిగాను అంటూ కీరిస్తారు మరో కీర్తనలో!

స్వరార్ణవ గ్రంథం - ఒక మహాతపస్వి తన తపస్సు ద్వారా అందుకున్న గ్రంథాన్ని సామాన్యులకి అందనివ్వరు మహాత్ములు. అయితే ఆ మర్మములు త్యాగరాజ కీర్తనలలో అంతర్లీనంగా ఉంటాయి. "**మోక్షము కలదా భువిలో..... రజతగిరీశుడు నగజకు తెల్పు స్వరార్ణవ మర్మములు**" అంటారు ఒక కీర్తనలో!

త్యాగరాజు కాలానికే ఆయన ప్రసిద్ధుడు, ఎందరో రాజులు ఆయనని ఆహ్వానించారు, కానీ ఆయన నిరాకరించారు! కోరి దరిద్రాన్ని వరించాడు! ఒక దివ్యమైన సంగీత విద్యని లౌకిక ప్రయోజనాలకు వాడలేదు!
***ఆదర్శం: సంగీత విద్యని ఆయన శిష్యులందరికీ నేర్పారు, కానీ ఏ శిష్యులనుండి కూడా ధనాన్ని తీసుకుని నేర్పలేదు! ఇది భారతీయ గురుకుల సంప్రదాయం! కేవలం శిష్యుల యోగ్యతలని తెలుసుకుంటూ, యోగ్యతని కల్పిస్తూ విద్యని నేర్పారు. ఈయన ఏమి చేసారంటే ఉంఛ వృత్తిని ఆశ్రయించారు! అంటే శిష్యులతో కీర్తనలు పాడుతూ వెళుతూ ఉంటే, అక్కడున్న శ్రోత్రియులు వారు వివిధ ఆహార పదార్థాలు ఇవ్వడం, అవి రామునికి నివేదించి వీరు తినడం! అలా కోరి దరిద్రాన్ని వరించారు! శాస్త్రం చెప్పినట్లు యోగి వలె జీవించారు!***
యోగులు జీవితాన్ని ఎలా తీసుకుంటారు అంటే, ఇది భోగం కోసం కాదు యోగం కోసం వచ్చింది! అందుకే తపస్సుతో  కష్టపడి శరీరానికి అతీతమైన పరమార్థాన్ని పొందాలి అనే ఉద్దేశంతో ఆ మహానుభావుడు మాదుకర వృత్తితో జీవించారు.

ఆ తర్వాత ఆయన జీవనవిధానంలో ప్రధానంగా రామతారక షడక్షరిని ఉపాసన చేసాడు. తాను నివసిస్తున్న తిరువయ్యారు సిద్ధక్షేత్రం. అక్కడ శివుడు పంచనదీశ్వరుడు, అమ్మవారు ధర్మసంవర్ధిని. ఆ పంచనదులలో స్నానం ఆచరిస్తూ నిష్ఠగా శివుని సన్నిధిలో రామనామజపం చేసేవారు. రోజుకి

లక్షా ఇరవై ఆరువేలు మార్లు చేసి, 38 సంవత్సరాలకి 96 కోట్ల జపం చేశారు! సుమారు 40 ఏళ్ల వయసుకి మంత్రసిద్ధి కలిగి రామదర్శనం పొందారు! అలా జరిగినట్లు కీర్తన కూడా ఉన్నది. మంత్రిక శరణాగతితో ఉన్నటువంటివారు నియమబద్ధంగా జీవితం గడుపుతూ ఉన్నప్పుడు ఏ సమయంలో తారకమంత్రం చేసినా గుణితం అవుతూ ఉంటుంది.

**రామదర్శనం**

విశ్వామిత్రునితో వెళుతున్న రామదర్శనం అయిందిట. అనేక కీర్తనల్లో ఆ స్వరూపాన్ని

"**వినయమునను కౌశికుని వెంటజనిన అంఘ్రులను చూచేదెన్నటికో**"

"**అలకలల్లాడగ గని ఆ రాన్ముని ఎటు పొంగెనో**" అంటారు

**పల్లవి:అలక లల్లలాడఁగ గని ఆ రాఘ్ముని ఎటు పొంగెనో ॥అ॥**

**అను పల్లవి:చెలువు మీఱఁగను మారీచుని మదమణఁచే వేళ ॥అ॥**

**చరణము(లు):**

**ముని కనుసైగఁ దెలిసి శివ - ధనువును విఱిచే సమయ**

**మున త్యాగరాజ విను - తుని మోమున రంజిల్లు ॥అ॥**

"ఏలా నీ దయ రాదు" అని ఎప్పుడూ అనుకునేవాడుట, ఒక్కసారి రామచంద్రమూర్తి దర్శనం అవ్వగానే

"బాలకనకమాయచేలా" అంటూ పొంగిపోయారు.

"రాజ" శబ్దంతో అద్భుతం చూపిస్తారు! రాక్షసులనే గజరాజుల పాలిటి మృగరాజువు అంటారు!

**పల్లవి: ఏల నీ దయరాదు పరాకు జేసే వేల సమయముగాదు ॥ఏ॥**

**అను పల్లవి:**

**బాల! కనకమయచేల! సుజనపరి**

**పాల! శ్రీరమాలోల! విధృతశర**

**జాల! శుభద! కరుణాలవాల! ఘన**

**నీల! నవ్య వనమాలికాభరణ! ॥ఏ॥**

**చరణము(లు):**

**రారా దేవాదిదేవ! రారా మహానుభావ!**
**రారా రాజీవనేత్రా! రఘువరపుత్రా!**
**సారతర సుధాపూర హృదయ పరి**
**వార జలధిగంభీర దనుజ సం**
**హార దశరథ కుమార బుధజన వి**
**హార సకలశృతిసార నాదుపై ॥ఏ॥**
**రాజాధిరాజ! మునిపూజితపాద! రవి**
**రాజలోచన! శరణ్య అతిలావణ్య!**
**రాజధరనుత! విరాజ తురగ! సుర**
**రాజవందిత పదాజ! జనక! దిన**
**రాజకోటి సమతేజ! దనుజగజ**
**రాజ నిచయ మృగరాజ! జలజముఖ! ॥ఏ॥**
**యాగరక్షణ! పరమ భాగవతార్చిత!**
**యోగీంద్ర సుహృద్భావిత! ఆద్యంతరహిత!**
**నాగశయన! వరనాగ వరద! పు**
**న్నాగ సుమధుర! సదాఘమోచన! స**
**దాగతిజ ధృతపదా! గమాంతరచర!**
**రాగ రహిత! శ్రీత్యాగరాజ నుత ॥ఏ॥**

అప్పటినుండి రామాయణంలో ఉన్న ఘట్టాలతో తాదాత్మ్యం పొంది, అనుభూతికి తెచ్చుకుని రామగీతాలు రచించారు. రామాయణంలో ఉన్న రామమూర్తులన్నింటిని త్యాగరాజ కీర్తనలలో ప్రత్యక్షం చేస్కోవచ్చు.

అటువంటి త్యాగయ్యకి రాజు నిధులు పంపి ఆహ్వానం పంపారు, అప్పుడు ఆయన నిధులని వెనక్కి పంపారు! "నిధి చాలా సుఖమా" అన్నారు.

త్యాగరాజుని హృదయకవి అంటారు! చెప్తే రాములవారితో, లేదా మనస్సుతో చెప్పుకున్నారు!
విన్నవించుకునేటప్పుడు రాములవారికి, మందలించేటప్పుడు మనస్సుతో!
తెలుగుమాట తియ్యందనం త్యాగయ్య కీర్తనలలో తెలుస్తుంది.
19 వ శతాబ్దం నడిమి భాగమున ప్రపంచ వ్యాప్తంగా ఒక సంగీత కార్యక్రమం ఇంగ్లాండ్లో జరిగింది.
భారతదేశంలో నుండి కూడా అనేక మంది వెళ్లారు, త్యాగయ్య కీర్తనలు ప్రదర్శిస్తున్నప్పుడు, ఆ
భాషకి ముగ్ధులు అయ్యారట, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్నారుట.

నేటికీ నిలిచిపోయి సామాన్యులకు తెలిసినవి ఎన్నో ఉన్నాయి

→ **ఎందరో మహానుభావులు**

→ **సామజవరగమనా**

→ **నను పాలింప నడచివచ్చితివో**

→ **ఎంత నేర్చినా ఎంత చూసినా ఎంతవారలైన కాంతదాసులే**

విశ్వనాథ వారు అంటారు, **త్యాగరాజ మహర్షి ఆత్మలో రసభావముల ఐక్యమరసిన తెలుగు భాష**"!
తెలుగులోనే సంగీతం ఉన్నది, అందుకే సంగీతానికి అనువైన భాష! ఇతర భాషల వారిచే కూడా
తెలుగులో పాడించారు త్యాగయ్య! అవి వేరే భాషలలో అనువదించవలసినవి కాదు!
ఆయన స్వరం, అక్షరం కలిసి ఒక సమాధి స్థితిలో నుంచి త్యాగయ్య నుండి వచ్చాయి. అందుకే
ఆయనని కవిగా చూడడం కాదు, యోగిగా దర్శించాలి! సమాధి నుండి వచ్చిన సత్య అక్షరాలని
మంత్రాలు అంటారు. త్యాగయ్య కీర్తనలు మంత్రాలు! స్వరము, అక్షరము కలిసి సిద్ధభూమిక నుండి
రావడం కోసం ఉపాసన చేసాడు! ఆ ఉపాసనా బలం వల్ల వచ్చింది. సంగీతకారుడిగా ఖ్యాతి పొందడం
కోసం ఉపాసన చెయ్యలేదు. రాముడిని సంగీత స్వరూపుడిగా, సంగీతాన్ని రామస్వరూపంగా
చూసాడు, దానితో ముక్తి పొందాడు! అలా ముక్తిని పొందాడు అని చెప్పడానికి ఆయన జీవితమే
నిదర్శనం!

త్యాగరాజు అంత త్యాగం మనకి లేకపోయినా భోగలాలస నిగ్రహించుకుంటూ భగవత్ కైంకర్యానికి
విద్యని వాడుకోవాలి అని సందేశాన్ని గ్రహించాలి!
ఆయువులు గడిచిపోతున్నా ఇంకా వెంపర్లాటలు వదలడం లేదే అనిపించినా చాలు.

ప. నిధి చాల సుఖమా రాముని
సన్నిధి సేవ సుఖమా నిజముగ పల్కు మనసా

అ. దధి నవనీత క్షీరములు రుచియో
దాశరథి ధ్యాన భజన సుధా రసము రుచియో (ని)

చ. దమ శమమను గంగా స్నానము సుఖమా
కర్దమ దుర్విషయ కూప స్నానము సుఖమా
మమత బంధన యుత నర స్తుతి సుఖమా
సుమతి త్యాగరాజ నుతుని కీర్తన సుఖమా (ని)

"నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా"
శమము, దమము సుఖమా? అదే గంగాస్నానం అది సుఖమా? బురదతో కూడిన విషయభోగలాలస అనే బురదనూతిలో స్నానం సుఖమా వోల్చుకో మనసా!
రాజు పంపించాడు, ఆయన మెచ్చుకుంటాడు అని ధనం వెళ్ళాలా? మమతాదులతో ఉన్న నరులని స్తుతించడం గొప్పదా లేదా సుమతి త్యాగరాజానుతుని కీర్తన సుఖమా" అంటున్నారు.
వారి జీవితంలో వేదాంతం ఉన్నది! బోధలకు ఉదాహరణలుగా ఉన్న గాథలు ఈ మహానుభావులవి! ఆస్తికత, తాత్త్వికత! ఇవి సత్యం అని రుజువు చేస్తాయి మహాత్ముల కథలు!

అటువంటి మహానుభవుడు జీవితాన్ని యోగంతో మలచుకుంటూ రామార్పణం చేస్కుని రాములవారి కైంకర్య గీతాలని అనేకం రచించారు.
మేలుకొలుపు నుండి
#మేలుకో దాశరథీ
#రక్షా బెట్టరే దొరకు రక్ష పెట్టరే
#ఉయ్యాయలలూగవయ్యా సయ్యాట పాటలకు సత్సార్వభౌమా
#"ఆరగింపవే పాలారగింపవే" తాను ఇస్తున్నప్పటికీ సీతమ్మ చేతితో పవిత్రమైన వెన్న, పాలు ఆరగింపవయ్యా అంటారు.

ఉపనిషత్ బ్రహ్మేంద్ర స్వామి అని కాంచీ యతీంద్రులు ఉండేవారుట, ఆయన త్యాగయ్యని కీర్తనలు వినిపించమని పిలిస్తే వెళ్లారట, రాజు పిలిస్తే వెళ్లనివాడు, యతిరాజు పిలిస్తే వెళ్ళాడు మహానుభావుడు. అలా వెళ్ళినప్పుడు అనేక క్షేత్రయాత్రలను చేశారట.

త్యాగయ్య వివాహం పార్వతమ్మ అనే ఆమెతో జరిగింది. కొన్ని ఏళ్ళకి ఆవిడ మరణించాక ఆవిడ చెల్లెలు కమలంబని వివాహము చేసుకున్నారు, వారి పుత్రిక సీతామహాలక్ష్మి.
త్యాగయ్యకి ఇద్దరు అన్నలు ఉండేవారు, పెద్దాయన జపేశయ్య, ఇంకో ఆయన చిన్నవయసులోనే మరణించారు.
జపేశయ్య ప్రతినాయకుడిగా చూపింపబడ్డారు, అలాంటిది ఏమి లేదు, కాకపోతే లౌకికుడు అంతే! ఇంటికి వచ్చిన సంపదని ఎందుకు వద్దు అంటావు అన్నాడు అంతే! సంపద అవసరం తెలియాలి అని వేరు చేసాడు!
త్యాగయ్య మాత్రం రామపంచాయతనం తనకి వస్తే చాలు అనుకున్నాడు! నేటికీ కూడా ఆ పరంపరలో ఉంటున్నది!
పంచాయతనం: సీతారాములు మధ్యలో కూర్చుంటారు, వెనక భరతశత్రుఘ్నులు, లక్షణ స్వామి, హనుమంతుడు ముందర ఉంటారు! సీతారాములు కలిపి ఒకటే అందుచేత పంచాయతనం!

కొందరు కథలు చెప్తూ ఉంటారు జపేశయ్య పంచాయతనం కావేరిలో పడేయడం, ఈయన వెతకడం ఇలా... కానీ ఇది కల్పితం! నాటకీయత కోసం కల్పనలు చేసారు!
"కనుగొంటిని శ్రీరాముని" అన్నది ఆయన దర్శనం జరిగినపుడు కూడా అయి ఉండవచ్చు!
జపేశయ్య పైన భక్తి ఉన్నది త్యాగయ్యకి! జపేశయ్యకి అనారోగ్యం కలిగినప్పుడు త్యాగయ్య రాములవారిని ఆరోగ్యం ప్రసాదించమని కోరుకున్న కీర్తన కూడా కనపడుతుంది.

ఇలా రాములవారిని కొలుచుకుంటూ జీవిస్తున్నప్పుడు నిందించే లోకం ఊరుకుంటుందా?
మహాత్ములని నిందించడం వల్ల ఏమి జరుగుతుంది అంటే ఈ జీవుడికి ఏవయినా పాపాలు ఉంటే నిందించేవారికి వస్తుంది! కీర్తిస్తే ఆ కీర్తించేవారికి పుణ్యం వస్తుంది! ఆ మహాత్మునికి పుణ్యం పాపం రెండూ పోయి మోక్షం వస్తుంది.
అనేకమంది ఈయనని నిందిస్తున్నప్పుడు బాధపడి రాములవారితో చెప్పుకుంటారు!

"నాదుపై పలికేరు నరులు వేదసన్నుతా! భవము వేరు చేసితిననుచు నాదు పై పలికేరు నరులు"
ఉంఛ వృత్తి చేస్తున్నాను, అంటే అది విప్రునికి శాస్త్రములో విధించినదే కదా స్వామి! స్వధర్మాన్ని వ్యతిరేకించి చేయలేదు కదా! "ప్రాణము ఏపాటిది అని మానమే మేలంటిని గాని" అంటూ చెప్పుకున్నారు స్వామితో!
నేను చేసిన తప్పు ఏమిటయ్యా! వంశాచారం అనుసరిస్తూనే చేస్తున్నాను కదా!
మన్మథుడికి తండ్రి అయిన ఓ నారాయణా! ప్రపంచంలో సుఖం మంచులాంటిది అని తెలుసుకున్నాను కనుక, ఆ ధనం కోసం నీ సరి ఎవరూ లేరు అంటూ ఇతరులని పొగుడుతూ తిరగవలసిన పని లేదు కదా!

ప. నాదుపై పలికేరు నరులు

అ. వేద సన్నుత భవము
వేరు జేసితిననుచు (నా)

చ1. పంచ శర జనక ప్రపంచమున గల సుఖము
మంచు వలెననుచు మదినెంచితి కాని
పంచుకొని ధనములార్జించుకొని సరియెవ్వ-
రంచు మరి గతియు లేదంచు పల్కితినా (నా)

చ2. దినము నిత్యోత్సవమునకాస జెందితి
నా మనసున ఇల్లు ఒకటియనియుంటి కాని
అనుదినమునొరుల మేలును జూచి తాళ
లేకను రెండు సేయ వలెననుచు పల్కితినా (నా)

చ3. ప్రాణమే పాటియని మానమే మేలంటి
కాని శ్రీ రామ పరమానంద జలధి
శ్రీ నాథ కులములో లేని దారిని పట్టి
జేనెడుదరము నింపనొరుల పొగడితినా (నా)

చ4. ఆజాను-బాహు యుగ శ్రీ జానకీ పతి
పయోజాక్ష శ్రీ త్యాగరాజ నుత చరణ
ఈ జగతిలో నిన్ను పూజించు వారి-
నవ్యాజమున బ్రోచు సు-రాజ నీవాడైన (నా)

ధనం ఎప్పుడు తిప్పి పంపేసినా వినయంగానే పంపారే కానీ తిరస్కరణ దృష్టితో పంపలేదు! తాను ఎంచుకున్న యోగానికి ఇది విరుద్ధం అని పంపేశారు!

కాంచీ క్షేత్రానికి బయల్దేరారు ఉపనిషత్ బ్రహ్మేంద్ర స్వామిని దర్శించడానికి ఆ దారిలో ఎన్నో క్షేత్రాలని దర్శించారు! ఆ క్షేత్ర సాహిత్యం!

**## తిరువత్తియూరు (చెన్నై సమీపంలో ఉన్నది, స్వామి త్యాగరాజేశ్వరుడు) - ఆదిపురం త్రిపురసుందరీ పంచరత్నములు**

1) సావేరి రాగంలో - "కన్నతల్లి"
2) బేగడ రాగంలో - "సుందరి నన్నందరిలో"
3) ఆరభి రాగంలో - "సుందరి నిను"
4) కళ్యాణి రాగంలో - "సుందరి నీ దివ్య రూపము"
5) శుద్ధ సావేరి రాగంలో - "దరిని తెలుసుకొంటి సుందరిని తెలుసుకొంటి" దరి అనగా సమీపము, వెతుకుతున్నది లభించినప్పుడు ఆ దరికి చేరడం అంటారు, అంటే మోక్షస్థానం!
"దరిని తెలుసుకొంటి సుందరిని తెలుసుకొంటి... త్రిపురసుందరి నిన్నే శరణంటి... మారుని జనకుడైన మా దశరథకుమారుని సోదరి దయాపరి మోక్షపు దరిని తెలుసుకొంటి"

**##కోవూరులో** సుందరేశ మొదలయ్యారు అనే భక్తుడు/శిష్యతుల్యుడు పిలవగా అక్కడికి వెళ్లారు! అక్కడ సుందరేశ్వరుడు అని ఉన్నాడు, అక్కడ కోవూరు పంచరత్నాలు అని శివునిపై కీర్తనలు రచించారు!
అద్వైత మార్గానికి చెందినవాడు కనుక రాముడిపై ప్రీతి ఉన్నా అభేద దర్శనం కలిగినవాడు! రామతత్త్వమే మిగిలిన దేవతా రూపాలతో ఉన్నది అనే శుద్ధ వైదిక మార్గానికి చెందినవాడు!

అభేదదర్శన జ్ఞానం అనే గొప్పభక్తి ఈయనది, అందుకే జీవన్ముక్తుడై అందరూ చూస్తూ ఉండగానే శరీరాన్ని త్యజించి రామైక్యం అవ్వగలిగాడు!

**కోవూరు పంచరత్నాలు**

1) శహన రాగం - ఈ వసుధ నీవంటి దైవము

2) ఖరహరప్రియ రాగం - కోరి సేవిమ్పరే కోర్కెలీడేరా

3) పంతువరాలి రాగం - శంభో మహాదేవ శంకర గిరిజారమణ

4) కళ్యాణి రాగం - నమ్మివచ్చిన నను నయముగా బ్రోవవే కొమ్మని వరములొసగే కోవూరి సుందరేశా

5) శంకరాభరణంలో - సుందరేశుని చూచి సురల చూడ మనసువచ్చునా

## **నాగలాపురం** అనే క్షేత్రంలో ఉన్న స్వామిపై కూడా రచించారు

## **షోలంగి నరసింహస్వామి** పై బిలహరి రాగంలో నరహరిని కీర్తించారు

అలాగే అక్కడ ఘటికాచలంలో "పాహి రామదూత" అంటూ హనుమంతునిపై వసంతవరాళిలో మంచి కీర్తన చేసారు.

## **పుత్తూరు ప్రాంతం - అద్భుత ఘట్టం**

అక్కడ ఒక విప్రుడు రాత్రివేళ కుటుంబంతో వచ్చి ఆశ్రయం కోసం చూస్తూ, సదాశివ/కామాక్షి మందిరం కనపడింది, తలుపు కొడితే ఎవరూ తీయలేదని, గోడ దూకాడు, నూతిలో పడ్డాడు! మృతప్రాయ స్థితిలో ఉన్నాడు! త్యాగయ్య అటుగా వస్తూ ఉండగా ఆ విప్రుని భార్య ఈయన తేజస్సు చూసి తన భర్తని రక్షించమని అడగగా, త్యాగరాజస్వామివారు తిన్నగా సదాశివేశ్వర మందిరంలోకి వెళ్లి పద్మాసనంలో కూర్చుని బిలహరి రాగంలో అద్భుత కీర్తన చేసారు, తన మంత్రశక్తిని ఆ కీర్తనలో ధ్వనింప చేసారు!

"నా జీవాధారా నా నోముఫలమా రాజీవలోచనా రాజరాజ శిరోమణి"

ప్రాణానికి కూడా ఆధారమైన వాడు పరమాత్మ! ప్రాణము ఆత్మ అనుకుంటూ ఉంటాము, కానీ బుద్ధికి, ప్రాణానికి కూడా ఆవల ఉన్నది ఆత్మ, అదే రాములవారు! ఆయన ఎలా దొరుకుతాడు? "నా నోము ఫలమా"

ఆ ఆత్మస్వరూపుడు మన శరీరంలో ఎలా ప్రకాశిస్తున్నాడు?
నా చూపు ప్రకాశమా
నా నాసికా పరిమళమా
నా జపవర్ణమా
నాదు పూజా సుమమా

రాగము, నాదము, భావము, అక్షరమూ ఇవన్నీ కలిపి మంత్రశక్తి అవుతుంది!
ఆయన పాడుతూ ఉంటే ఆ నాదతరంగాల్లో రామశక్తి ప్రకాశిస్తుంది!

**ప. నా జీవాధార నా నోము ఫలమా**
**అ. రాజీవ లోచన రాజ రాజ శిరో-మణి (నా)**
**చ. నా చూపు ప్రకాశమా నా నాసికా పరిమళమా**
**నా జప వర్ణ రూపమా నాదు పూజా సుమమా**
**త్యాగరాజ నుత (నా)**

"నా జపవర్ణమా" ఇది ఇక్కడ పెట్టారు రహస్యాన్ని!
మంత్రం జపం చేస్తూ ఉంటే ఆ అక్షరంలో తేజస్సు ఉంటుంది, ఆ తేజస్సుకి వర్ణము/రంగు, రూపము కూడా ఉంటాయి! అదే ఇక్కడ త్యాగయ్య చూపిస్తున్నారు, "మంత్రములోని అక్షరముల తేజస్సు, వర్ణము, ఆ మంత్రం అధిదేవత రూపము" రెండూ కలిపి "నా జపవర్ణ రూపమా"
రామమహామంత్రమైన ఆ తేజస్సు స్వరూపాన్ని హృదయంలో భావిస్తూ "ఆయన నా ఆత్మ, ప్రాణము, నా చూపుకు ప్రకాశం, ఆయన నా నాసికకు పరిమళము" ఇలా ధ్యానం చేయాలి!
భగవంతుడు ఎవరు? జీవానికి ఆధారం అయినవాడు! కంటికి కన్ను, చెవికి చెవి ఆయన!
ఇది కేనోపనిషత్తులోని రహస్యం: "శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనోయత్ వాచో: వాచం ప్రాణస్య ప్రాణః చక్షుష చక్షు: అతిముచ్యే ధీరః ప్రేత్యాస్మాన్ లోకాన్ అమృతా భవంతి "

అలా ఉపనిషత్తులని ఎలా పట్టారో చూడాలి త్యాగయ్య!

***జపం చేస్తున్నప్పుడు ఎలా భావించాలి?***
***జపం/ధ్యానం చేస్తున్నప్పుడు ఈ విధమైన భావం ఉండాలి! జపం చేస్తున్న దేవత నాలో ఆత్మస్వరూపం, అదే నాలో ఊపిరి, కంటికి చూపు, చేతికి కదలిక, నాలోని చైతన్యం అని! చైతన్యం అంతా ఆ దేవత అని తెలియగానే మంత్రచైతన్యం అనుభవంలోకి వస్తుంది!***
అలా త్యాగయ్య మంత్రచైతన్యం అచేతనమైన జీవుడికి చైతన్యం ఇవ్వగలిగింది! ఆ విప్రుని బ్రతికించగలిగింది!

త్యాగయ్య కీర్తనలు చదువుకుంటే ఉపనిషత్ వాక్యాల్లా చిన్నగా కనపడుతుంది, కానీ వ్యాఖ్యానిస్తే ఎంతో! అది పాడేటప్పుడు రాగప్రస్తారం (భక్తిగా చేసినప్పుడు, అహంకారం కాకుండా) గమనించాలి! సంగీతం ఎలా పాడాలి, ఏ విధంగా దర్శించాలి అని మనకి చెప్పాడో తెలుసుకోవాలి! ఆయన మ్యూసికాలజిస్ట్! తన కీర్తనలలో సంగీతరహస్యాలు పెట్టాడు!

## నాగలాపురం మీదుగా తిరుపతి వెళుతున్నప్పుడు ఒక విశేషం జరిగింది. సుందరేశ మొదలయ్యారు ద్రవ్యం రామకైంకర్యానికి సమర్పించుకోవాలనుకున్నారు, త్యాగయ్య ఒప్పుకోరు అని పల్లకిలో పెట్టించి, శిష్యులకి చెప్పారు! దొంగలు ఆ విషయం గ్రహించి, పల్లకి కాస్త దూరం వెళ్ళాక, రాళ్లు రువ్వారట! త్యాగయ్య ఏమి జరిగిందో తెలుసుకుని, ఆ ద్రవ్యం రామకైంకర్యానికి ఇవ్వబడింది అని తెలుసుకుని, రామకైంకర్యానికి కదా రాములవారే చూస్కుంటారులే అని ఒక కీర్తన చేస్తారు!
రామరక్షా రహస్యాలన్నీ ఈ కీర్తనలో ఉంటాయి!
రామరక్షా స్తోత్రం అంతా ఆ కీర్తనలో ఉన్నది!
"నా ముందు, వెనుక, ఇరువైపులా కూడా మహా బలవంతులైన రామలక్ష్మణులు ధనుస్సులను ఎక్కుపెట్టి నన్ను రక్షింతురు గాక" అని! ఈ భావమే చాలు రక్షిస్తుంది.

"ముందు వెనుక ఇరుప్రక్కల తోడై మురఖరహర రారా రారా"
ఇక్కడ రాములవారిని, కృష్ణుడిని కలిపేశారు, ఆయనకి బేధం ఎక్కడ! మురహరుడు అంటే కృష్ణుడు, ఖరహరుడు అంటే రాములవారు!
చండభాస్కర కులాబ్ది చంద్రా కోదండపాణి అయి

ఓ గజారక్షకా ఓ రాజకుమారా

ఓంకారసదనా రారా రారా

త్యాగయ్య దృష్టిలో రాములవారు తారకబ్రహ్మము! రామనామజపం చేస్తే మోక్షము వస్తుంది!

**ప. ముందు వెనుకయిరు పక్కల తోడై**

**ముర ఖర హర రారా**

**అ. ఎందు కాన నీయందము వలె రఘు**

**నందన వేగమే రారా (ము)**

**చ1. చండ భాస్కర కులాబ్ధి చంద్ర**

**కోదండ పాణియై రారా**

**అండ కొలుచు సౌమిత్రి సహితుడై**

**అమిత పరాక్రమ రారా (ము)**

**చ2. ఓ గజ రక్షక ఓ రాజ కుమార**

**ఓంకార సదన రారా**

**భాగవత ప్రియ బాగ బ్రోవవయ్య**

**త్యాగరాజ నుత రారా (ము)**

"రఘువీర రణధీర రార రాజకుమారా" - హుస్సేన్ రాగంలో స్వరపరిచారు! సౌర్య సంబంధమైన రాగము!

"ర" అగ్నిస్వరూపమైన అక్షరం!

"మ" సౌమ్యత్వం, అందుకు "మ" పెట్టలేదు!

**ప. రఘు వీర రణ ధీర రారా రాజ కుమార**

**అ. భృగు సూను మద విదార బృందారకాధార (ర)**

**చ. రావణ ఘట కర్ణ**

**బలారాతి రిపు నగ నగారి**

**స్థావర జంగమ రూప**
**త్యాగరాజ హృచ్చారి (ర)**

***విశ్వనాథ వారు త్యాగయ్య గురించి చెప్తూ:***
త్యాగయ్య ఎలా చెప్తే అలా ఆడాడు రాములవారు! అంటూ ఎన్నో కీర్తనలని పేర్కొన్నారు.
నాదప్రకంపన వచ్చినప్పుడు వాయువులో స్ఫోటము ఏర్పడుతుంది అందులోనుండి శక్తి పుడుతుంది, అది మంత్రశక్తి, నాదశక్తి అది తెలియాలి!
పరాత్పరుడైనప్పటికీ చరాచరజగత్తులో ఉన్నాడు కనుక! అందుతున్న జగత్తులో అంతర్యామిగా ఉన్నవాడు అందనివాడైనా మరుగువదిలి రావలసిందే త్యాగయ్య పిలిస్తే!

"మరుగేలరా ఓ రాఘువా"
**పల్లవి: మఱుగేలరా ఓ రాఘవ ॥మ॥**
**అను పల్లవి:**
**మఱుగేల చరాచర రూప! పరాత్పర! సూర్య సుధాకరలోచన! ॥మ॥**
**చరణము(లు):**
**అన్ని నీవనుచు అంతరంగమున తిన్నగా వెతకి తెలిసికొంటినయ్య**
**నిన్నెగాని మది నెన్నఁ జాల నొరులనన్నుఁ బ్రోవవయ్య త్యాగరాజనుత ॥మ॥**
ఎందుకయ్యా కనపడవు, సూర్యచంద్రులే నీ కనులుగా కలిగిన చరాచరరూపుడవు కదా!
***తిన్నగా వెతికి అంటే ఏకాగ్రతతో, సంశయాది దోషములతో అటు ఇటు చెదరకుండా ఏకాగ్రతతో సాధన చేయడం!***
*1) సర్వస్వ భావన 2) ఏకాగ్ర భావన 3) తదేకం/తాదాత్మ్యం*
"నిన్నెగాని మది నెన్నఁ జాల నొరుల" - అనన్యభక్తి!
అందుచేత మరుగు విడిచి కనపడవయ్యా అని కీర్తించారు!
లోకంలో ఎవరైనా ఏమైనా అంటే ఏమి అనరు త్యాగయ్య, రాములవారితోనే చెప్పుకుంటారు!
అలాగే తన సాధనని పరిశీలించుకుంటూ రాముల వారి అనుగ్రహం దొరకడం లేదు అంటే నేను సరిగా సాధన చేయడంలేదు, దానికి తగ్గట్లు జీవించడంలేదు అనుకుంటా, ఇలాంటి పాపాత్మాపు చరిత్ర కలిగిన నన్ను ఎవరూ కాపాడలేరు నువ్వు తప్ప!
"**కటకట నా జీవితము కర్ణకఠోరమయ్యా ఎటుల బ్రోతువో తెలియా ఏకాంతరమయ్యా**"

ఏకాంతారామయ్య: విశ్వానికి అతీతమైన పరతత్త్వము! ఏకాంతభక్తి అంటే పరమాత్మ తప్ప అన్యం లేదని, ఆయన్నే కోరుకుంటూ ఉండేవాడు ముక్తుడే!
నారదోపాస్తి మంత్ర సిద్ధుడు అయినటువంటి త్యాగయ్య ఆ మార్గంలోనే సాధన చేసారు.
రామకృష్ణపరమహంస అంటారు కలియుగంలో భక్తియే ముఖ్యం! కబుర్లు కట్టిపెట్టి శుద్ధభక్తి పెంచుకోవాలి! వేదాంతాలు ఎన్ని చర్చలు చేస్తే ఏమిటి ప్రేమరూపమైన భక్తి లేనప్పుడు!

"అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు" అన్నారు!
***పరమాత్మపై అనురాగము అంటే నిరంతర ప్రేమరూపమైన చిత్తవృత్తి ఉండాలి! ఇదే పరా అనురక్తి!***
***"సాపరానురక్తిరీశ్వరే" - శాండిల్యుని భక్తిసూత్రాలలోని భావం!***
***"సాత్వస్మిన్ పరమప్రేమరూపా" అంటారు నారదులవారు భక్తిసూత్రాల్లో!***
***పరమాత్మపై ప్రేమ ఉంటే జ్ఞానం/మోక్షం ఆయన చూసుకుంటారు!***
***ఆయన తప్ప మరేమీ లేనటువంటి హృదయం ఉండాలి!***

ఆత్మపరిశీలన: అది చేసుకోవాలి ఎప్పటికప్పుడు! తానుగొప్పవాడిని అని సిద్ధుడిని అని అనుకోవడంకూడదు! ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి!
నైత్యానుసంధానము: అల్పత్వాన్ని భగవానునికి సమర్పించుకోవాలి! నైత్యానుసంధానము అంటారు! అహంకారం "అహం బ్రహ్మాస్మి" అయినా చేయగలగాలి, లేదా అహాన్ని కరిగించి పరమాత్మకు అర్పణం చేయాలి. రెండిట్లో ఏదో ఒకటి చేయాలి! రెండవ పద్ధతి "ఆత్మపరిశీలన/నైత్యానుసంధానం".
"కటకట నా జీవితము కర్ణకఠోరమయ్యా ఎటుల బ్రోతువో తెలియా ఏకాంతరమయ్యా"

తత్త్వమూర్తిగా ఒక్కొక్కప్పుడు, ముద్దురాముడిగా కూడా కనపడ్డారు త్యాగయ్యకి! నిర్గుణ-సగుణ సమన్వయము! ఈ రెండు విధాలుగా ఆయన రాములవారిని దర్శించారు!
మొత్తానికి భకతపరుడైన శ్రీరామభద్రమూర్తి త్యాగరాజెట్టులాడించిన అట్టులాడే"

ఇందాకటి ఘట్టానికి తిరిగి వెళితే ఆ దొంగలు రాళ్లు రువ్వడం ఆపేసారు! పక్కరోజు ఆ దొంగలు వచ్చి త్యాగయ్యకి క్షమాపణలు చెప్పి త్యాగయ్యతో అంటున్నారు, నువ్వు ఏదో పాట పాడావు, అప్పుడు ధనుస్సుని సంధించి కనపడ్డారు, వారిని చూడగానే మాకు దొంగతనం చేయాలనే బుద్ధియే పోయింది

అంటున్నారు! ఈయన పాదాలమీద పడి మరొకసారి పాడితే వారిని దర్శించుకుని వెళతాము అన్నారట!

***రామదర్శనం అయితే శుద్ధసత్త్వ భూమికకు వెళతాము! ఆయన్ని హృదయంలో ధ్యానిస్తే రాజస, తామస గుణాలు పోయి, సత్త్వగుణం పెరిగి, త్రిగుణాతీత స్థితికి వెళతారు అని చెప్పా దల్చుకున్నాడు వాల్మీకి!***

త్యాగయ్య అనుకున్నారట పాడిందేమో నేను దర్శనం మీకు అని! కానీ కనపడాలి అంటే ఎదురుగా నిలబడాలి కదా! యదలో ఉన్నవాడు ఎదురుగా నిలబడితే కనపడతాడు! త్యాగయ్య హృదయంలోనే ఉన్నాడు రామచంద్రమూర్తి!

ఆయన సంగీతంలోని మంత్రశక్తి,భక్తి కలిసి స్వామిని సాక్షాత్కరింప చేశాయని తెలుస్తుంది!

## **తిరుపతి/తిరుమల**

తిరుమల వెళ్లారట! ఆ సమయంలో స్వామికి సేవా కైంకర్యాలు జరుగుతున్నాయట! (ఎంతపెద్దవారు వచ్చినా స్వామి కైంకర్యం ఆపకూడదు)! అప్పటికే పేరు పొందిన త్యాగయ్య వచ్చారని దర్శనం ఏర్పాటు చేయబోతే త్యాగరాజస్వామి వద్దు జరగవలసిన కైంకర్యాలు జరగివ్వండి అని ఒక భావనలోకి వెళ్లి ఈ కీర్తన చేసారు!

"తెర తీయగ రాదా"
విశ్వమే ఆయన రూపం అంటున్నాము, ఉన్నాడన్న అనుభవం వస్తున్నదా? అది ఎందుకు? మాయతెర వల్ల!
స్వామి నాలోని మత్సరమను తెరతీయరాదా అంటున్నారు!
ఆకలితో చేప గాలానికి తగులుకుంటున్నట్లు ఈ తెరకు అంటుకుంటున్నాము!
వల అని తెలియకుండా వచ్చి మృగములు పడిపోతున్నట్లు ఇది తెర అని తెలియక తగులుకుపోతున్నాము కనుక నువ్వే తొలగించాలి అయ్యా అని కీర్తించాక స్వామివారు తెర తెగేలా చేసారు!

**ప. తెర తీయగ రాదా లోని**

తిరుపతి వేంకట రమణ మత్సరమను (తెర)
అ. పరమ పురుష ధర్మాది మోక్షముల
పార-దోలుచున్నది నా లోని (తెర)
చ1. మత్స్యముయాకలి కొని కాలముచే
మగ్నమైన రీతినున్నది
అచ్చమైన దీప సన్నిధిని మరు-
గడ్డబడి చెరచినట్లున్నది (తెర)

చ2. ఇరవొందగ భుజియించు సమయమున
ఈగ తగులు రీతినున్నది
హరి ధ్యానము సేయు వేళ చిత్తము
అంత్యజు వాడకు పోయినట్లున్నది (తెర)

చ3. వాగురమని తెలియక మృగ గణములు
వచ్చి తగులు రీతినున్నది
వేగమే నీ మతముననుసురించిన
త్యాగరాజ నుత మద మత్సరమను (తెర)
దర్శనం కాగానే "వేంకటేశ నిను సేవింపగా పదివేల కన్నులు కావలెనయ్యా" అంటారు!
ప. వేంకటేశ నిను సేవింపను పదివేల కనులు కావలెనయ్య
అ. పంకజాక్ష పరిపాలిత ముని జనభావుకమగు దివ్య రూపమును కొన్న (వేంక)
చ1. ఎక్కువ నీవని దిక్కుల పొగడ
అక్కర కొని మది సొక్కి కనుగొన
నిక్కము నీవే గ్రక్కున బ్రోవు
తళుక్కని మెరసే చక్క తనము గల (వేంక)
చ2. ఏ నోము ఫలమో నీ నామామృత
పానము అను సోపానము దొరికెను
శ్రీ నాయక పరమానంద నీ సరి
కానము శోభాయమానాంఘ్రులు గల (వేంక)

చ3. యోగి హృదయ నీవే గతియను జన
భాగధేయ వర భోగీశ శయన
భాగవత ప్రియ త్యాగరాజ నుత
నాగాచలముపై బాగుగ నెలకొన్న (వేంక)

## కాంచీపురం

వరదరాజ స్వామిపై
"వరదరాజ నిన్నే కోరి వచ్చేరా మ్రొక్కేరా" అంటూ స్వరభూషణిలో
"వరదా నవనీతాశా పాహి వరదానవ మదనాశా ఏహి" అంటూ రాగపంజరా అనే రాగంలో

## శ్రీరంగం

"ఓ రంగసాయి పిలిచితే ఓయనుచు రారాదా" అంటూ కాంభోజి రాగంలో
" రాజువెడలెఁ జూతమురారే" అంటూ దేశికరాగంలో చేసారు.

అలా వివిధ క్షేత్రాలని దర్శిస్తూ అక్కడున్న మహాత్ములెందరినో తరింపచేసారు!

రామతత్త్వం క్షుణ్ణంగా తెలిసినవారిలో ఈయనొకడు! భగవంతుడు ఎవరికి అర్థమవుతాడు? అంటే ఉపాసించినవాడికి అర్థమవుతాడు, ఉపన్యసించిన వాడికి కాదు! రీసెర్చ్ స్కాలర్స్ కి భగవానుడు దొరకడు! అహంకారానికి భగవంతుడు దొరకడు! "ఈశ్వరస్యాప్యభిమాన ద్వేషిత్వాత్ దైన్య ప్రియత్వాత్ చ" అంటారు నారదులవారు భక్తిసూత్రాల్లో! నారదభక్తి సూత్రాలు అధ్యయనం చేయాలి, మన జీవినావిధానంగా మలచుకోవాలి!

రామా! నేను పుట్టిందే నిన్ను కీర్తించడానికి అంటారు త్యాగయ్య!
సంగీతాన్ని భగవత్ కైంకర్యానికి వాడుకున్నప్పుడు గొప్ప సంగీతం వస్తుంది!
" ఏ పనికో జన్మించితిని అని ఎంచవలదు"
నేను ఎందుకు జన్మించానో నీకు మాత్రం తెలియదా!

ప. ఏ పనికో జన్మించితినని నీవెంచ వలదు శ్రీ రామ నే(నే పని)

అ. శ్రీ పతి శ్రీ రామచంద్ర నీ చిత్తమునకు తెలియదా నే(నే పని)

చ. వాల్మీకాది మునులు నరులు నిన్ను వర్ణించిరి నాయాస తీరునా
మేల్మియైయుండు సద్భక్తులు మెచ్చుదురే త్యాగరాజ నుత నే(నే పని)

నాకోసమే అవతరించావు నువ్వు అంటారు త్యాగయ్య! - ఇది భక్తిలో గొప్ప భావం! అంతేకాని రాముడున్నాడా! కృష్ణుడున్నాడా అంటూ రీసెర్చ్ చేయడం కాదు! ఏది ఎప్పుడూ ఉంటుందో అదే రాముడు, అదే కృష్ణుడు!
"ఏల యవతారమెత్తికొంటివో ఏమి కారణమో" ఆ మాటలో ఉన్న అందం ఎంత వ్యాఖ్యానించినా తెలియదు!
యుద్ధం చేయడానికా? యోగులను పాలించడానికా? యోగం లేక సంసారరోగంలో రక్షించడానికి వచ్చావా?
నీ నామాన్ని అన్నా, నీ కథలను విన్నా భవరోగం పోతుంది!
ఇదంతా కాదయ్యా! "శతరాగరత్నమాలికతో నిన్ను కీర్తించే త్యాగరాజుని రక్షించడానికి వచ్చావా" అంటారు!

ప. ఏలావతారమెత్తుకొంటివి ఏమి కారణము రాముడై
అ. ఆలము సేయుటకా అయోధ్యపాలన సేయుటకా ఓ రాఘవ (ఏ)

చ. యోగులు జూచుటందుకా భవ
రోగుల బ్రోచుటందుకా శత
రాగ రత్న మాలికలు రచించిన త్యాగ-
రాజుకు వరమొసగుటందుకా (ఏ)

"పదివేసములలో రామవేసమే బహుబాగానుచు" అంటారో కీర్తనలో!

రామతత్త్వం పూర్తిగా తెలిసినవాడు త్యాగరాజస్వామి!

రామతత్త్వం పావుభాగం - బ్రహ్మదేవుడికి, సగభాగం - పార్వతీదేవికి; సంపూర్ణంగా రామతత్త్వం తెలిసింది - శివుడికి!
"రామ" గురించి మనకి తెలుసు అనుకోవడం ఎంత అజ్ఞానమో తెలియాలి!
రామతత్త్వానికి గురువు ఈశ్వరుడు!
కానీ త్యాగరాజు ఆ విషయంలో శివునికంటే మించినట్లు అనిపిస్తుంది అంటున్నారు! అంటే శివుడే అని చెప్పడం!

చల్లపల్లి వెంకటశాస్త్రి గారు అంటారు "త్యాగరాజు శివుడు" అంటూ! ఆయన మనకు దేవుడు అంటారు! భాగవతులకు అగ్రగణ్యుడు! కలిలో భాగవత మార్గంలోనే తరిస్తాము! అది చూపినవారు త్యాగయ్య!
తారకమంత్రం ఆయన ఊపిరి/రక్తనాళస్పందన అయిపోయింది. ఆయన తారకబ్రహ్మస్వరూపుడు!
"త్యాగయ్య మానవుడు కాదు, దేవుండు మనకు నిజము" అంటారు!
ఇది చూడకుండా ఏ రాగము అంటూ కూర్చోవడం కాదు, త్యాగరాజుది రాగంలో యోగం, యోగంలో రాగం! రెండూ వేరు కాదు!

రామనామతత్త్వము
"పేరిడి నిన్ను పెంచినవారెవరే"
"సార సారతర తారక నామమును" - అన్నింటికీ సారము అయినటువంటి పేరు! - సారతారోపనషత్తు రహస్యం!
"సర్వ మతములకు సమ్మతమైన" - రామ అంటే ఆనందస్వరూపుడు! ఏ మతంవాడికి వద్దు ఆనందము ?

**ప. పేరిడి నిను పెంచిన వారెవరే**

**అ. వారిని జూపవే శ్రీ రామయ్య**

**చ1. సార సారతర తారక నామమును (పే)**

**చ2. సర్వ మతములకు సమ్మతమైన (పే)**

**చ3. ఘోర పాతకముల కొప్పునయణచు (పే)**

**చ4. త్యాగరాజు సదా బాగుగ భజియించు (పే)**

రామ = ఆనందస్వరూపుడు

ర, అ, మ = సూర్య/చంద్ర./అగ్నుల తేజస్సు! సర్వజీవులలో సూర్యచంద్రాగ్నులు ఉన్నారు!
శరీరము/దృష్టి = సూర్యతత్త్వము, వాక్కు = అగ్నితత్త్వము; మనస్సు = చంద్రతత్త్వము. ఇవే మన త్రికరణములు! త్రికరణములలో ఏ పరబ్రహ్మ తేజస్సు ప్రకాశిస్తున్నదో అదే రామ!
అటువంటి రామ నామము తెలిసి రామనామము చేయాలి! ఆయన బ్రహ్మము అనే భావనతో చేయాలి!
"తలపులన్ని నిలిపి నిమిషమైన" - ఇది సాధ్యమా? అరపై క్షణాలు నిలిపితే చాలు అంటున్నారు!
జ్ఞాత్వా కుర్వీత కర్మాణి కదా, అది! అందుకే తెలుసుకో, గురువులని ఆశ్రయించు, తెలిసి చేయి అంటున్నారు!
ఒకళ్ళు మనకి ఇష్టము అన్నప్పుడు "అష్టపుష్ట ఆనవాళ్లు" వెతుకుతాము కదా! రాముడిమీద ప్రేమతో అవన్నీ తెలుసుకుని సాధన చేయాలి!

**ప. తెలిసి రామ చింతనతో నామము సేయవే ఓ మనసా**
**అ. తలపులన్ని నిలిపి నిమిషమైన తారక రూపుని నిజ తత్వములను (తె)**

**చ1. రామాయన చపలాక్షుల పేరు**
**కామాదుల పోరు వారు వీరు**
**రామాయన బ్రహ్మమునకు పేరు**
**ఆ మానవ జననార్తులు తీరు (తె)**

**చ2. అర్కమనుచు జిల్లెడు తరు పేరు**
**మర్కట బుద్ధులెట్టు తీరు**
**అర్కుడనుచు భాస్కరునికి పేరు**
**కు-తర్కమనే అంధకారము తీరు (తె)**

**చ3. అజమనుచు మేషమునకు పేరు**
**నిజ కోరికలేలాగీడేరు**
**అజుడని వాగీశ్వరునికి పేరు**
**విజయము కల్గును త్యాగరాజ నుతుని (తె)**

వేదాలు పుట్టిందే పరబ్రహ్మను వర్ణించడానికి కదా!
రామనామము - వేదవర్ణనీయం; రూపము: బ్రహ్మరుద్రాదులు కూడా ధ్యానించే రూపము;  నీ చరిత్ర ధర్మాన్ని, ఆనందాన్ని ఒకేసారి కలిగించే మోక్షదాయకమైన చరిత్ర!
"ముని రాజ వేషియౌ" - విద్ధిమాం ఋషిభిస్తుల్యం" అంటారు కదా రాములవారు!

ప. ఎవరికై అవతారమెత్తితివో
ఇపుడైన తెలుపవయ్య రామయ్య

అ. అవనికి రమ్మని పిలిచిన మహరాజెవడో
వానికి మ్రొక్కెద రామ (ఎ)

చ. వేద వర్ణనీయమౌ నామముతో
విధి రుద్రులకు మేల్మియగు రూపముతో
మోద సదనమగు పటు చరితముతో
ముని రాజ వేషియౌ త్యాగరాజ నుత (ఎ)

రామస్వరూపం వర్ణించే కీర్తనల్లో
స్వామి నీ తత్త్వము (మనసు), నీ రూపం (స్వరూపం), నీ దినుసు (బ్రహ్మవస్తువు) ఇవి మరొకరికి ఉంటాయా?

ప. లావణ్య రామ కనులార జూడవే అతి (లా)
అ. శ్రీ వనితా చిత్త కుముదశీత-కర శతానన్యజ (లా)
చ. నీ మనసు నీ సొగసు నీ దినుసు వేరే
తామస మత దైవమేల త్యాగరాజ నుత దివ్య (లా)

"కోటిమన్మథులైన సాటిరాని సొగసు నాటియున్నది మదిని మేటి శ్రీరామా! నా పాలి శ్రీరామా! భూపాలక సోమా! కాపాడు సమయము నీ పాదములీరా" అని కీర్తిస్తారు!

అటువంటి స్వామి సొగసు చూడతరము కానిది! స్వామిని మొత్తమూ వర్ణించే కీర్తన!

ప. సొగసు జూడ తరమా నీ

అ. నిగ-నిగమనుచు కపోల

యుగముచే మెరయు మోము (సొ)

చ1. అమరార్చిత పద యుగము

అభయ ప్రద కర యుగము

కమనీయ తను నిందిత

కామ కామ రిపు నుత నీ (సొ)

చ2. వర బింబ సమాధరము

వకుళ సుమంబులయురము

కర ధృత శర కోదండ

మరకతాంగ వరమైన (సొ)

చ3. చిరు నగవులు ముంగురులు

మరి కన్నుల తేట

వర త్యాగరాజనుత

వందనీయయిటువంటి (సొ)

ఆ సొగసుని ఎప్పుడు మరువరాదు!

"నీటు" = తీర్చిదిద్దిన సొగసు

మెల్లని మృదుపైన మాట కదా స్వామిది (పలుకు కండచక్కెరను గేరునే పడతులారా వినరే అంటారు మరో కీర్తనలో)

పావల గిలుకో - పాదుకల గురించి

బ్రోచు దురమో - భక్తులను రక్షించడానికి చూపించే వేగమో

ఆజీవము హృద్రాజీవముతో పూజింతు - బ్రతికున్నంత కాలము హృదయపద్మంతో కొలుచుకుంటున్నాను అంటారు!

ప. మరవకరా నవ మన్మథ రూపుని

చ1. నీటో మెల్లని మాటో కన్నుల

తేటో మరి వలె-వాటో మనసా (మ)
చ2. కులుకో పావల గిలుకో కపురపు
పలుకో చెక్కుల తళుకో మనసా (మ)
చ3. విల్లో ఘంటల ఘల్లో సుమముల
ఇల్లో సేవపు కొల్లో మనసా (మ)
చ4. కేలోవుంగరాలో బంగా(రు)య్యాలో
చెంతనిల్లాలో మనసా (మ)
చ5. శరమో కనకాంబరమో శ్రీ-కర
ఉరమో బ్రోచు దురమో మనసా (మ)
చ6. ఆజీవము హృద్రాజీవముతో
పూజింతుర త్యాగరాజ నుతుని మనసా (మ)

సర్వదేవతలయందు అభేద భావము కలిగినవాడు కదా, అందుచేత పంచనదీశ్వరునిపై కూడా రచించారు

ప. ఇలలో ప్రణతార్తి హరుడనుచు
పేరెవరిడిరే శంకరుడని నీ(కిలలో)
అ. తలచి కరగి చిర కాలము పదమున
దండమిడిన నాయెడ దయ లేదాయె (ఇలలో)
చ. కర చరణయురము నొసలు భుజములు
ధరణి సోక మ్రొక్కగ లేదా
శరణనుచును మొరలిడ లేదా
పంచ నదీశ త్యాగరాజ నుత నీ(కిలలో)

ప. దేవాది దేవ సదాశివ
దిన నాథ సుధా-కర దహన నయన
అ. దేవేశ పితామహ మృగ్య
శమాది గుణాభరణ గౌరీ రమణ (దే)

చ. భవ చంద్ర కలా ధర నీల గళ
భాను కోటి సంకాశ శ్రీశ నుత
తవ పాద భక్తిం దేహి దీన బంధో
దర హాస వదన త్యాగరాజ నుత (దే)

శివభక్తిని అడిగాడా అంటే రాముని, శివుని మధ్య భేదం లేదని తెలిసినవాడు!

ధర్మసంవర్ధిని అమ్మవారితో ఒక మాట అంటారు
"పురాణ పురుషుడగు రామునికియాపురారికిని నీకు రాజ ధరి మచ్చరాన వేరెంచ రాదు అను త్యాగరాజునిక విడువ రాదు సతతము"
రామునికి, శివునికి, నీకు మాత్సర్య భావంతో వేరుగా చూడరాదు!
కమల వైరి కలాధరుని కొమ్మ = చంద్రలేఖను ధరించావడి ఇల్లాలా

ప. కరుణ జూడవమ్మ కమల వైరి
కలా ధరుని కొమ్మ
అ. ధరను సరియు దొరకని పంచ నద
నగర నాయకి ధర్మ సంవర్ధని (క)
చ1. అనేక జగదాధారివి
నీవనే మదిని నెర నమ్మితి
కానేమనే వాడనోయని నీ మది-
నెంచనే వద్దనుచునాతని
వేడుదునే నాదుపై వినే చాడి
చాలునే నీదు దయకు నేను పాత్రు-
డౌదునే కువలయ నయనే సు-వసన
జఘనే విధు నిభ వదనే సంతతము (క)
చ2. మదమున తెలియక జేసిన కర్మ
విదారి నీవని నమ్మితినే నీ
పదారవింద యుగళ భక్తినిమ్మని

దానమడిగితినే నీకు తోచదేమి
ఉదారి నీ దయను దాచ రాదు
దరి దాపు లేకను సదా మొరలిడ
వినదా చెవులు ఎవరుదా బ్రోతురిక
సదాశివ హితే ముదాన సతతము (క)
చ3. పరాశక్తి నాయొక చిత్తము
తామరాకు నీరు విధము తల్లడిల్ల
రాదు అందునకేమి ఫలము
శంబరారి వైరికియర్ధ శరీరి
పురాణ పురుషుడగు రామునికియా
పురారికిని నీకు రాజ ధరి
మచ్చరాన వేరెంచ రాదు అను త్యాగ-
రాజునిక విడువ రాదు సతతము (క)

ధర్మసంవర్ధని అమ్మవారిపై మరో కీర్తన:
ప. అమ్మ ధర్మ సంవర్ధని-
యాదుకోవమ్మ మా(యమ్మ)

అ. ఇమ్మహిని నీ సరియెవరమ్మ
శివుని కొమ్మ మా(యమ్మ)

చ1. ధాత్రి ధర నాయక ప్రియ
పుత్రి మదన కోటి మంజుళ
గాత్రి అరుణ నీరజ దళ
నేత్రి నిరుపమ శుభ
గాత్రి పీఠ నిలయే వర హస్త
ధృత వలయే పరమ
పవిత్రి భక్త పాలన ధురంధరి

వీర శక్తి నే నమ్మినా(నమ్మ)

చ2. అంబ కంబు కంఠి చారు
కదంబ గహన సంచారిణి
బింబాధర తటిత్కోటి
నిభాభరి దయా వారి నిధే
శంబరారి వైరి హృచ్ఛంకరి
కౌమారి స్వర జిత
తుంబురు నారద సంగీత మాధుర్యే
దురిత హారిణి మా(యమ్మ)

చ3. ధన్యే త్ర్యంబకే
మూర్ధన్యే పరమ యోగి హృదయ
మాన్యే త్యాగరాజ కుల
శరణ్యే పతిత పావని
కారుణ్య సాగరి సదా
అపరోక్షము కారాదా సహ్య
కన్యా తీర వాసిని పరాత్పరి
కాత్యాయని రామ సోదరి మా(యమ్మ)

మరో కీర్తన
ప. నన్ను కన్న తల్లి నా భాగ్యమా
నారాయణి ధర్మాంబికే

అ. కనకాంగి రమా పతి సోదరి
కావవే నను కాత్యాయని (నన్ను)

చ. కావు కావుమని నే మొర పెట్టగా

కమల లోచని కరగుచుండగా
నీవు బ్రోవకుంటే ఎవరు బ్రోతురు
సదా వరంబొసగు త్యాగరాజ నుతే (నన్ను)

రామచంద్రమూర్తితో అంటారు! రామా! నువ్వు ఎక్కడుంటావయ్యా! ఎవరు నువ్వు? సమస్తదేవతా స్వరూపముగా రాములవారిని చూడడం! అది పూర్ణ భక్తి అవుతుంది!

ప. ఏ తావునరా నిలకడ నీకు
ఎంచి జూడనగపడవు
అ. సీతా గౌరి వాగీశ్వరియను
శ్రీ రూపములందా గోవింద (ఏ)
చ. భూ కమలార్కానిల నభములందా
లోక కోటులందా
శ్రీ కరుడగు త్యాగరాజ కరార్చిత
శివ మాధవ బ్రహ్మాదులయందా (ఏ)

ఆ కాలంలో ఈయన కీర్తి బాగా వ్యాపించింది కదా! కాశీక్షేత్రంలో గణేష్ గిరిభావే అనే సంగీతకారుడు ఉండేవాడు! ఆయన ఒకరోజు వెతుక్కుంటూ తిరువయ్యారు వచ్చి త్యాగరాజస్వామిని దర్శించి, సాష్టాంగ దండం పెట్టి, కళ్లనీళ్లు పెట్టుకున్నాడు! ఎవరయ్యా అని అడిగితే, అతడు, చెప్పాడు "నేను సంగీత విద్వాంసుడిని, రాములవారి భక్తుడిని, నిన్న రాములవారు కలలో కనపడి చెప్పారు, ఏమని అంటే "నిజమైన భక్తి కలవారే నిజమైన సంగీతకారులు, అటువంటి వారి సంగీతమే నాకు నచ్చుతుంది, అటువంటి వారు ఇప్పుడు ఒక్క త్యాగరాజస్వామియే, వెళ్లి చూస్కో" అని! చెప్పారట అది వినగానే త్యాగయ్య ఆనందం పట్టలేకపోయాడు! అప్పుడంటారు నాగురించి ఆశ తీరిపోయేలా దూరదేశాల్లో కూడా ప్రకాశింపచేసిన రసికశిరోమణి!

ప. దాశరథీ నీ ఋణము దీర్ప నా
తరమా పరమ పావన నామ
అ. ఆశ తీర దూర దేశములను ప్రయాసదీర

ప్రకాశింప జేసిన రసిక శిరోమణి (దా)
చ. భక్తి లేని కవి జాల వరేణ్యులు
భావమెరుగ లేరని కలిలోన జని
భుక్తి ముక్తి కల్గునని కీర్తనముల
బోధించిన త్యాగరాజార్చిత (దా)

ఎంత ప్రేమయ్యా! నామీద నేనేమిచ్చి ఋణం తీర్చుకోగలను అంటారు!
ఎత్తుగడలో ఆర్తిని గమనించాలి!
రామా! ఏదో పూర్వజన్మల విశేషం వల్ల నువ్వు పట్టుకున్నావో, నేను పట్టుకున్నానో, నీ చేయితో అనుబంధం ఏర్పడింది! వదలకయ్యా!
పుట్టకతోనే నిజభక్తిని ఇచ్చావు!
గుట్టు చెదరక బ్రోచి - లోపలి తత్త్వరహస్యము చెదరకుండా బ్రోచి

ప. పట్టి విడువ రాదు నా చెయిపట్టి విడువ రాదు
అ. పుట్టిన నాడే నిజ భక్తిని మెడ
కట్టి గుట్టు చెదరక బ్రోచి చెయి (ప)
చ. నిత్యానిత్యములను బోధించి
కృత్యాకృత్యములను తెలిపించి
ప్రత్యేకుడు నీవని కనిపించి
భృత్యుడైన త్యాగరాజు చెయి (ప)
రాములవారి అనుగ్రహం ఆలస్యం తట్టుకోలేక నిలదీస్తాడు!
ఎత్తుగడలోనే ఆర్తి కనపడుతుంది!
పక్షులు ఎక్కడ తిరిగినా చెట్టువద్దకు వచ్చినట్లు నేను నిన్ను ఆశ్రయించాను! ఇన్ని జన్మల చుట్టు తిరిగినా బ్రహ్మమే అసలు చోటు! అలా అసలువాడవైన నిన్ను పట్టుకున్నాను! అటువంటి నన్ను అనుగ్రహించడానికి ఇంకా ఆలస్యం చేస్తున్నావేంటి స్వామి!

ప. కాల హరణమేలరా హరే సీతా రామ
అ. కాల హరణమేల సుగుణ

జాల కరుణాలవాల (కా)
చ1. చుట్టి చుట్టి పక్షులెల్ల
చెట్టు వెదకు రీతి భువిని
పుట్టగనే నీ పదముల
పట్టుకొన్న నన్ను బ్రోవ (కా)
చ2. పొడవునయెంతాడుకొన్న
భూమిని త్యాగంబు రీతి
కడు వెలసియున్న నీవు
గాకయెవరు నన్ను బ్రోవ (కా)
చ3. దిన దినమును తిరిగి తిరిగి
దిక్కు లేక శరణు జొచ్చి
తనువు ధనము నీదేయంటి
త్యాగరాజ వినుత రామ (కా)

ఎవరు ఏడ్చినా వినడానికి బాగుండదేమో కానీ భక్తుడు ఏడిస్తే మాత్రం సంగీతం అవుతుంది! ఒక మీరాభాయి, ఒక సూరదాసు ఇటువంటి ఎందరో మహానుభావులు సంగీతంతో భగవంతుని ప్రసన్నం చేసుకున్నారు!

మరో కీర్తనలో నిలదీస్తారు ఎదుటపడితే నీ సొమ్మేమైనా పోతుందా స్వామి!
నుదుటిరాత దాటడం నా తరం కాదు కానీ నీ తరం అవుతుంది!
నువ్వు నాదగ్గరికి రావడం ఆలస్యం చేస్తే నిన్ను దేవతలంతా మెచ్చుకుంటారా ఏమిటి అందుకే రావడంలేదా?
హరామి తనమేలరా - మంకు, బెట్టు

ప. ఎదుట నిలిచితే నీదు సొమ్ములేమి పోవురా
అ. నుదుటి వ్రాత కాని మట్టు మీరను
నా తరము తెలిసి మోస పోదునా (ఎదుట)
చ1. సరాసరిగ జూతురా నాదు-

**యవసరాల తెలియుము వరాలడుగ**
**జాలరా సకల దేవ రాయ మనవి**
**వినరాఘు హర సుందరాకార నా(యెదుట)**
**చ2. విదేహజా రమణ దేవ బ్రోవగ-**
**నిదే సమయమన్య దేవతల**
**వేడదే మనసు తెలియదేమి రాఘువ**
**ఇదేటి శౌర్యము పదే పదే నా(యెదుట)**
**చ3. తరాన దొరకని పరాకు నా-**
**యెడను రామ జేసితే సురాసురులు**
**మెత్తురాయిపుడుయీ హరామి తన-**
**మేలరా భక్త త్యాగరాజ నుత నా(యెదుట)**

త్యాగయ్య రాములవారిని పలకరిస్తారు, రావేమిటి అని నిలదీస్తారు, ఆర్తిని చెప్పుకుంటారు, ఆ స్వామితో ఆవేదన విన్నవించుకుంటూ ఆరాధన చేసుకున్నారు!

**సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు**